క్లుప్తంగా

అదనపు డీఎంహెచ్‌ఓకు వినతి

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్న నేపథ్యాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరపీడితులతో మాట్లాడాక వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయన అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ సైదులుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు నేలకొండపల్లి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పువ్వాడ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్ ఎన్‌పీడీసీఎల్ జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు తండ్రి రాజారావు(80) మృతి పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన రాజారావు భౌతికాయాన్ని మంత్రి సందర్శించి నివాళులర్పించి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజా ఉన్నారు.

24న 'ఇతిహాసం' ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24వ తేదీన మైత్రీ కళానిలయం విజయవాడ వారిచే ఇతిహాసం నాటిక ప్రదర్శన ఉన్నట్లు నిర్వాహకుడు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్, కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్ కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఖమ్మం కళాపరిషత్, ప్రజా నాట్యమండలి సహకారంతో నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటలకు నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ధార కన్యాకుమారి, యార్రా నరసింహారావు, తంగెళ్లపల్లి శ్రీలక్ష్మి, బోగ శ్రీహరి, తంజావూరి విజయలక్ష్మి, వంగవీటి దయాకర్, దూలం శ్రవణ్‌కుమార్, తాళ్లూరి సరిత, సముద్రాల నాగేశ్వరరావు మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్.వీ. ప్రసాద్, అగర్వాల్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు సోమవారం ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆటో అడ్డాలకు ఆటోస్టాండ్ కేటాయించాలని కోరుతూ ట్రాఫిక్ సీఐ అశోక్‌కు తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రమ్, నాయకుడు జిల్లా ఉపేందర్ మాట్లాడుతూ రమణగుట్ట, కరుణగిరి, బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీలకు వెళ్లేందుకు మయూరిసెంటర్ నుంచి ప్రజలకు సానుకూల మార్గం కావడంతో మయూరిసెంటర్‌లో ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు విష్ణువర్ధన్, దండగల ఉపేందర్, హనుమంతరావు, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

ఖమ్మం మామిళ్లగూడెం: పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి జిల్లా కన్వీనర్‌గా చింతల కిరణ్‌శౌరి నియమితులయ్యారు. ఈమేరకు పెరికల రాజకీయ ఐక్యత, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి చైర్మన్ ముత్తినేని వీరయ్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌శౌరి మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వరుసగా మోటార్లు చోరీ

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పొలాల్లో అమర్చిన విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. కోరట్లగూడెంలో గత వారం రెండు మోటార్లు, చెన్నారంలో ముగ్గురి మోటార్లను ఎత్తుకెళ్లారు. మళ్లీ మంగళవారం రాజేశ్వరపురానికి చెందిన రైతు చలవాది రామారావు మోటార్ చోరీ కావడంతో ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పోలీసులు పెట్రోలింగ్ పెంచి చోరీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ ఆంటోని
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	జైలర్
శ్రీనివాస	జవాన్
సుందర్	ఖుషి

- ఖమ్మంగాంధీచౌక్

కొలువుదీరిన గణనాథుడు..



విఘ్నాలను తొలగించే వినాయకుడి పూజలను సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఇళ్లు, వీధులు, కూడళ్లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన మండపాలను ఏర్పాటు చేసి గణనాథులను ప్రతిష్ఠించారు. పలువురు దంపతులు పూజలో పాల్గొని నైవేద్యం కింద ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, వివిధ రకాల పండ్లు తదితర వాటిని స్వామివారికి సమర్పించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకోనున్న ఏకదంతుడి మండపాల వద్ద రాత్రి సమయాన సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు



కూసుమంచి: గట్టుసింగారంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్ బాలగణపతి ఆలయం వద్ద పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ బాజిన్ని వీరయ్య దంపతులు తదితరులు



ఖమ్మంగాంధీచౌక్: పూజలు చేస్తున్న కిరాణ జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులు



ఖమ్మంగాంధీచౌక్: ఉత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ బాల గంగాధర్ తిలక్



ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో.. పూజలు చేస్తున్న ప్రతినిధులు



కూసుమంచి: ఉత్సవ కమిటీ బాధ్యుల పూజలు



కామేపల్లి: పండితాపురంలో గణనాథుడికి పూజలు చేస్తున్న అర్చకుడు



గాంధీగంజ్‌లోని గణేశ్ టెంపుల్‌లో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు



గాంధీచౌక్‌లోని గణేశ్ టెంపుల్ వద్ద విద్యుత్ లైట్లతో సెట్టింగ్

మత సామరస్యానికి ప్రతీకగా గణపతి ఉత్సవాలు..

ఖమ్మంగాంధీచౌక్: మత సామరస్యానికి ప్రతీకగా ఖమ్మం ఫోర్ వీలర్స్ అసోసియేషన్ బాధ్యులు ఏటా నగరంలోని బైపాస్ రోడ్డు ఆటోనగర్‌లో కాణాపాకం విఘ్నేశ్వర ఉత్సవాల పేరిట 20 ఏళ్లుగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ అసోసియేషన్‌లో భిన్నమైన మత సంస్కృతుల వారు ఉన్నప్పటికీ ఐక్యంగా ఉంటూ ఉత్సవాల్లో పాల్గొనే మతస్తులందరి ఆర్థిక చేయూతతో గణపతి వేడుకలను నిర్వహిస్తున్నారు. చివరి రోజున వేలాది మందికి అన్నదానం చేస్తున్నారు. కాగా, అసోసియేషన్ ప్రతినిధులు మహంకాళి మల్లిఖార్జున్, కేసగాని రవి, గంగవరపు శ్రీనివాసరావు, శ్యామేందర్ రెడ్డి, పాషా, ఏసురాజు తదితరుల ఆధ్వర్యాన ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.



పూజలో పాల్గొన్న అసోసియేషన్ బాధ్యులు

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

కూసుమంచి: ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన అందుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. విజయభేరీ సభలో ప్రకటించిన గ్యారంటీ కార్డుల ఇంటింటి ప్రచారాన్ని మంగళవారం మల్లాయిగూడెంలో ఆయన టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సోనియాగాంధీ సారథ్యాన రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కూసుమంచి, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షులు మట్టె గురవయ్య, కళ్లెం వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్, సేవాదళ్ నాయకుడు బచ్చలికూర నాగరాజు, నాయకులు ఎండీ హఫీజ్, మంకెన వాసు, వెంకన్న, వీరన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గ్యారంటీ కార్డులతో ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్త ఓటర్లపై నిగ్గు తేల్చండి

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గం పరిధిలోని డబుల్ ఓటర్ల జాబితాపై నిగ్గు తేల్చాలని కోరుతూ మంగళవారం రూరల్ తహసీల్దార్ బీ.వీ.రామకృష్ణకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గవ్యాప్తంగా 1,500కు పైగా ఓటర్ల పేర్లు రెండు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో నమోదైనట్లు తాము గుర్తించామని, కొంతమంది ఓటర్ల పేర్లు నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో నమోదై ఉన్నాయని తెలిపారు. ఇట్టి జాబితాను పరిశీలించి డబుల్ ఓటర్లను తొలగించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణకుమారి, నాయకులు

జేఐహెచ్ ఆధ్వర్యాన ఓటరు నమోదు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఖిల్లా, మోమినాన్ ఏరియా, పాండురంగాపురం, వెంకటేశ్వరనగర్, సారథినగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో జమాతె ఇస్లామిహింద్(జేఐహెచ్) ఆధ్వర్యాన ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా మాట్లాడుతూ.. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ అధ్యక్షులు అబ్దుల్ మల్లిక్, అబ్రార్ అలీ, షేక్.రఫీ, ఎస్ఐఓ నగర అధ్యక్షుడు అమేర్, కార్యదర్శి మతిన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: మహాకవి జాషువా జయంతి సందర్భంగా ఈ నెల 28న పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు 'మన కాలపు జాషువా' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు జాషువా సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నగరంలోని సంక్షేమ భవన్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే జాషువా జయంతి వేడుకలకు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు గుండెపాక నర్సయ్య కొత్తపల్లి గురుప్రసాద్, నారపోగు సుదాకర్, ఎస్.గోపి, దారెల్లి వెంకయ్య, కోండ్రు బ్రహ్మం, నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



పులిపాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంరాపర్తినగర్: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని లకిడికాపూల్ వాసవీ భవన్‌లో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన శాలువతో సత్కరించి.. జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడగా.. గోళ్ల రాధాకృష్ణ, గుమ్మడవెల్లి శ్రీనివాస్, సిద్ధంశెట్టి శ్రీకాంత్, మాశెట్టి వరప్రసాద్, వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, కుంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, కొదుమూరు భద్రయ్య తదితరులు ప్రసాద్‌ను అభినందించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి..



భిక్షపతిని సన్మానిస్తున్న గల్లా సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన బోళ్ల భిక్షపతియాదవ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడగా.. తనకు ఈ అవకాశం కల్పించినందుకు భిక్షపతి కృతజ్ఞతలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దిగజార్చొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పార్టీలో చేర్చుకుంటే, పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా రాయల నాగేశ్వరరావు వ్యాఖ్యలు చేయడం సరికాదని తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎవరెవరికి టికెట్ ఇవ్వాలో అధిష్టానం చూసుకుంటుందని, రాయలకు టికెట్ ఇస్తామని ఎవరైనా చెప్పారో వెల్లడించాలని సూచించారు. ఇటీవల బీఆర్ఎస్ మంత్రిని కలిశాకే రాయల కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో కొప్పుల అశోక్, రాజు, లింగన్న, రవి, విక్రమ్‌రెడ్డి, అజ్మీరా బాలాజీ, కొలిచలం వెంకటేశ్వర్లు, గోరెమియా, గుంతేటి వెంకటేశ్వర్లు, ఊడుగు ఉపేందర్, నజీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నెట్‌బాల్ పోటీలకు 'న్యూ విజన్' విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఎ.క్రిస్టోరెక్స్ తెలంగాణ రాష్ట్ర సీనియర్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ చూపడంతో ఎంపిక చేశారని న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సీజీహెచ్‌కే ప్రసాద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరెగూడెంలో షూటింగ్..



షూటింగ్‌లో పాల్గొన్న చిత్రబృందం

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెంలో సోమవారం సినిమా షూటింగ్ సందడి చేశారు. తొలుత శ్రీలక్ష్మి సమ్మక్క క్రియేషన్స్ ఆధ్వర్యాన నిర్మిస్తున్న గోల్డ్ నంబర్ -1 చిత్ర యూనిట్ సభ్యులు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక గ్రామంలోని పలుచోట్ల చిత్రానికి సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. కాగా, ఈ సినిమాలో నటించేందుకు కొంతమంది స్థానికులకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, చిత్ర యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాయ్‌లూసీ

కామేపల్లి: ముచ్చర్ల గ్రామంలోని ఇమాన్యుల్ ప్రార్థన మందిరం పాస్టర్ జాన్ ఎబినేజర్ నిరుపేద పాస్టర్లకు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. ప్రార్థనకు వెళ్లాల్సిన సమయాన పాస్టర్లు ఇబ్బంది పడుతుండడంతో రూ.50 వేల విలువైన పది సైకిళ్లను గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎబినేజర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జాన్సన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యాన మంగళవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, సీఐటీయూ నాయకుడు విష్ణు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనులు చేస్తున్నా.. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వేతనాలు ఇప్పించాలని కోరారు.

విద్యార్థుల స్వచ్ఛ ర్యాలీ..

కామేపల్లి: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ముమ్మరంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొమ్మినేపల్లి హైస్కూల్‌లో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి పాల్గొన్ని విద్యార్థులచే స్వచ్ఛ ర్యాలీ, ప్రతిజ్ఞలు చేయించి చెత్త నిర్వహణ విధానంపై బోధించారు. అనంతరం డంపింగ్‌యార్డు, వర్మీకంపోస్ట్ తయారీ విధానం, చెత్తా నుంచి వస్తువుల తయారీ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కార్యదర్శి మాలోత్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

ఖమ్మంరాపర్తినగర్: రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి, రూ.600 వేతనం రోజువారీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శివలింగం, బందెల వెంకయ్య, కంకణాల అర్జున్ రావు, బీరెల్లి లాజర్, ఆవుల మంగతాయి, రెంటాల యాదగిరి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, గోగుల సోములు, కేలోతు పాపారావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

అనాసాగారం వాసికి అవార్డు..



అవార్డు అందుకుంటున్న వీరబాబు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారానికి చెందిన మాజీ సర్పంచ్, కవి చిలకబత్తిని వీరబాబుకు అవార్డు లభించింది. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్.కే. కళా సాంస్కృతిక ఫౌండేషన్ బాధ్యులు నంది అవార్డు అందజేశారు. వీరబాబు తన సాహిత్యంతో ప్రజలను చైతన్యపరిచిన సందర్భంగా అవార్డు లభించగా.. పలువురు మండల వాసులు వీరబాబును అభినందించారు.

అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం



ఖమ్మంఅర్బన్: సమ్మెలో మాట్లాడుతున్న జావీద్



కామేపల్లి: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల సంఘీభావం

ఖమ్మంఅర్బన్/కామేపల్లి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం అర్బన్ తాహసీల్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన సమ్మెను సంఘీభావం ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్ రోడ్డులో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మెకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంఘ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐతో పాటు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ టీచర్లకు రూ.10లక్షలు, ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరావు, మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు మందుల ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగిడిపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే రిజర్వేషన్ బిల్లు



మాట్లాడుతున్న పోటు కళావతి

ఖమ్మం వన్‌టౌన్: భారత జాతీయ మహిళా సమాఖ్య పోరాట ఫలితంగానే ప్రస్తుత ప్రభుత్వం మహిళా బిల్లును ఆమోదించిందని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి తెలిపారు. కేంద్ర మంత్రివర్గం మహిళా బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యాన రిజర్వేషన్ బిల్లుకోసం పోరాడిన గీతా ముఖర్జీకి నివాళులర్పించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రిజర్వేషన్ బిల్లును క్యాబినెట్ ఆమోదించినా పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందేందుకు సభ్యులందరూ సహకరించాలని ఆమె కోరారు. మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షురాలు తాటి నిర్మల, పోటు మమత, ముంతాజ్‌బేగం, మున్నీసా, మాధవి, కమల, జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.